క్లుప్తంగా

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థులు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన వట్లూరు గురుకుల పాఠశాల విద్యార్థులు

పెదపాడు: వట్లూరు డాక్టరు బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారని ఆదివారం ప్రిన్సిపాల్ దాసరి మేరీ ఝాన్సీ తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల ఆధ్వర్యంలో పోలసానిపల్లిలో ఈనెల 14 నుంచి 17వరకు నిర్వహించిన పోటీల్లో కబడ్డీలో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. విజేతలు రాష్ట్ర అదనపు కార్యదర్శి సునీల్ రాజ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతిని పొందారని ప్రిన్సిపాల్ వివరించారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాట్నాలమ్మ

పెదవేగి : అడిగిన కోర్కెలు నెరవేర్చేతల్లి రాట్నాలమ్మకు వివిధ ప్రాంతాల నుంచి చేరి వచ్చిన ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో వెలసిన రాట్నాలమ్మ తల్లికి ఆదివారం ప్రీతికరమైన రోజుకావడంతో భక్తులు దేవస్థానానికి చేరుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఈ వారం అమ్మవారిని పూజా టికెట్ల విక్రయంపై రూ.15,680, లడ్డూ ప్రసాదంపై రూ.13,275, ఫొటోల విక్రయంతో రూ.2,605, మొత్తం రూ.46,817 ఆదాయం లభించిందని దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్.సతీష్‌కుమార్ చెప్పారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.

దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి



వైఎస్సార్‌సీపీ ఏలూరు ఇన్‌ఛార్జి జయప్రకాష్‌ను సత్కరిస్తున్న గంటా పండు

దెందులూరు: దళితుల సమస్యల పరిష్కారానికి మాలసేన సభ్యులు ఐక్యతతో కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఆదివారం వైఎస్సార్‌సీపీ నేత గంటా పండు మాలసేన జిల్లా కార్యదర్శిగా నియమితులైన నేపథ్యంలో జయప్రకాష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆయన్ను సత్కరించారు. జయప్రకాష్ గంటా పండును, నూతన కమిటీని అభినందించారు. కార్యక్రమంలో వంగాయగూడెం 18వ డివిజన్ ఇన్‌ఛార్జి గంటా రాజేశ్వరరావు, ఏలూరు జిల్లా వైసీపీ జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ వైఎస్‌పీ శివరావు ఉన్నారు.

26న మహాధర్నా

దెందులూరు: రైతు సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న ఏలూరు కలెక్టరేట్ వద్ద ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహిస్తున్నామని జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావుతో కలిసి ఆయన మాట్లాడుతూ కేంద్రం ఢిల్లీ రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు, కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరపై గ్యారంటీ చట్టం తీసుకురావాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

ఉంగుటూరు: జాతీయ రహదారిపై ఉంగుటూరు వద్ద ఆదివారం రాత్రి నడిచి వెళుతున్న ఆర్.నాగరాజును కై కరం వైపు వెళుతున్న మోటారు సైక్లిస్టు ఢీకొట్టాడు. కె.పెంటపాడుకు చెందిన ఆర్ నాగరాజు కాలినడకన ద్వారకా తిరుమల వెళుతున్నాడు. నాగరాజు ఉంగుటూరు దాటే సరికి తాడేపల్లిగూడెం నుంచి కైకరం వైపు మోటారుసైకిల్‌పై వెళుతున్న గ్రామానికి చెందిన ఆకుల సునీల్, రవి వేగంగా వచ్చి ఢీకొట్టాడు. దాంతో నాగరాజు తలకు గాయమైంది. మోటార్ సైకిల్‌పై వెళుతున్న సునీల్, రవికి గాయాలయ్యాయి. వీరందరినీ హైవే అంబులెన్సులో తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

విద్యార్థులకు 'అపార్' కష్టాలు

- ఆధార్‌లో తప్పులతో ఇక్కట్లు
- నియోజకవర్గంలో 20 శాతం విద్యార్థుల ఆధార్‌లో దోషాలు
- అందరికీ అపార్ ఇవ్వాలని ఉన్నతాధికారుల ఆదేశాలు
- స్కూల్ రికార్డుల్లో దోషాల సవరణకు విద్యాశాఖ అవకాశం
- క్షేత్రస్థాయిలో అనేక సమస్యలతో ఇబ్బందులు



పత్తేపురం జెడ్పీ స్కూల్లో అపార్ కార్డుల దరఖాస్తులను ఆన్‌లైన్ చేస్తున్న సిబ్బంది



ఆధార్‌లో తప్పులు సరిచేసుకునే దరఖాస్తుతో జల్లికొమ్మర విద్యార్థులు

నిడమర్రు: ప్రతి విద్యార్థికి తన జీవితకాలంలో వ్యక్తిగత, విద్యాప్రగతి గుర్తించేలా ప్రత్యేక గుర్తింపు సంఖ్యను కేటాయించేందుకు కేంద్రం ప్రభుత్వం తీసుకు వచ్చిన అపార్ (ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ) కార్డుల జారీలో పాఠశాల/కళాశాల స్థాయిలో సమస్యలు కొనసాగుతునే ఉన్నాయి. నెలరోజులుపైగా ఈ ప్రక్రియ ప్రారంభించినా ఇప్పటికీ 80 శాతం మంది విద్యార్థులకు మాత్రమే అపార్ కార్డుల సంఖ్య కేటాయించిన పరిస్థితి. మిగిలిన 20 శాతం మంది ఆధార్‌లో తప్పులున్నట్లు ఆయా స్కూల్ హెచ్‌ఎంలు నిర్ధారించారు. కానీ ఉన్నతాధికారుల నుంచి మాత్రం నూరుశాతం అపార్ కార్డులు జారీ చెయ్యలంటూ రోజు ఉపాధ్యాయులపై ఒత్తిడి పెరుగుతోందని వారు గగ్గోలు పెడుతున్నారు. దీనికి పరిష్కారంగా ప్రతి గ్రామంలో విద్యార్థుల కోసం మొబైల్ ఆధార్ కేంద్రాలు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

20 శాతం ఆధార్‌లోనే తప్పులు

స్కూల్ రికార్డ్ (యూడైస్ ప్లస్)లోని వివరాలతో ఆధార్ కార్డులో నమోదైన వివరాలు ఒకేలా పోలి ఉంటేనే ఈ అపార్ కార్డ్‌కు సంబంధించిన 12 అంకెల అపార్ సంఖ్య సంబంధిత వెబ్‌సైట్‌లో జనరేట్ అవుతుంది. ఆధార్‌లో, స్కూల్ రికార్డుల్లో చిన్న అక్షరం మార్పు ఉన్నా అపార్ సంఖ్య విద్యార్థులకు ఇవ్వలేని పరిస్థితి ఉంది. దీంతో ఆధార్‌లోనూ, స్కూల్ రికార్డులో ఉన్న వివరాల్లో ఎక్కడ దోషముందో తెలుసుకునేందుకు ఉపాధ్యాయులు నెల రోజులుగా తలలు పట్టుకుంటున్నారు. చివరకు అపార్ కార్డు రాకపోవడానికి కారణం ఆధార్‌లోనే తప్పులున్నట్లు గుర్తించారు. చిన్నారులకు ఆధార్ నమోదు సమయంలో తల్లిదండ్రులకు అవగాహన లేకపోవడంతో జారీ చేసిన కార్డుల్లో చిన్నపాటి తప్పులన్నాయి. వివరాలు, అక్షర దోషాలతోనే ఆధార్ కార్డులు జారీ అయ్యాయి. స్కూల్ రికార్డులో నమోదులో ఆధార్ కార్డు కంటే జనన ధ్రువీకరణ పత్రంలోని పేర్లు, పుట్టిన తేదీలను మాత్రమే పరిగణలోకి తీసుకుని ఉపాధ్యాయులు తల్లిదండ్రుల అంగీకరంతో మాత్రమే ఆన్‌లైన్ చేసేవారు. దీంతో ఎక్కువ విద్యార్థుల వివరాలు ఆధార్‌లోనూ, యూడైస్ ప్లస్‌లోనూ స్వల్పమార్పులు చోటు చేసుకున్నాయి. ప్రస్తుతం ఆ విద్యార్థికి కేంద్రం జారీ చేసే అపార్ కార్డును అందించాలంటే నమోదైన వివరాల్లో వ్యత్యాసం ఉంది.

ఆన్‌లైన్ రికార్డుల్లో మార్పుకు అవకాశం

ఆన్‌లైన్‌లో ఉన్న స్కూల్ రికార్డుల్లో మార్పులకు విద్యాశాఖ అధికారులు అవకాశం కల్పించారు. ఇప్పటి వరకూ స్కూల్ ఆన్‌లైన్ రికార్డు (యూడైస్ ప్లస్) లో ఒక్క అక్షరం కూడా మార్పుకు అవకాశం లేదు. స్కూల్లో రికార్డుల్లోనూ తప్పులున్నట్లు గమనించిన అధికారులు ఆ మేరకు ఎంఈవో అనుమతితో సంబంధిత ధ్రువీకరణ పత్రాల ద్వారా నమోదు రిజిస్టర్‌లోనూ, ఆన్‌లైన్ రికార్డుల్లో మార్పుకునేందుకు వెసులుబాటు కల్పించడంతో 80 శాతం వరకూ అపార్ కార్డులు జనరేట్ అయినట్లు ఉపాధ్యాయులు చెపుతున్నారు.

మండలం	ప్రభుత్వ/ప్రైవేటు విద్యాసంస్థలు	విద్యార్థుల నమోదు	అపార్ ఐడీ కేటాయించిన విద్యార్థులు	విద్యార్థుల శాతం
గణపవరం	74	8,441	6624	74
భీమడోలు	63	10,408	8,766	84
ఉంగుటూరు	83	8,283	6,755	81
నిడమర్రు	51	4,564	3,711	81

క్షేత్రస్థాయిలో సమస్యలు

- ఆధార్‌లోని పుట్టిన తేదీతో విద్యార్థుల స్కూల్ రికార్డులో పుట్టిన తేదీ సరిపోలనప్పుడు ఉన్నత పాఠశాల హెచ్‌ఎంలకు తిప్పలు తప్పడం లేదు. అది చిటికెలో అయిపోయే పనిలా అధికారులు హెచ్‌ఎంపై ఒత్తిడి చేసి తీవ్ర మానసికి వేదనకు గురిచేస్తున్నారని ఉపాధ్యాయులు వారు వాపోతున్నారు.
- ఆధార్‌లో మార్పులకు తల్లిదండ్రులు కూలి పనులు మానుకొని వెళ్లడం లేని సరిస్థితి గ్రామాల్లో ఉంది.
- 18 ఏళ్లు నిండితేనే ఆధార్‌లో పుట్టిన తేదీ మార్పు జరుగుతుందని ఆధార్ కేంద్రాల నిర్వాహకులు అంటున్నారని తల్లితండ్రులు చెపుతున్నారు.
- ఆధార్‌లో పుట్టిన తేదీగా సంవత్సరం మాత్రమే ఉన్న వాటిని స్కూల్ రికార్డుల్లోని పుట్టిన తేదీ సంవత్సరం ఒక్కటే అయితే హెచ్‌ఎంఇచ్చే సర్టిఫికెట్ ఆధారంగా డేట్ ఆఫ్ బర్త్‌ను మారుస్తారు. అదే విధంగా పేరును కూడా మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.
- ఆధార్ కార్డుల్లో చేసిన మార్పులు కనబడటానికి కనీసం 15 రోజుల సమయం పడుతుంది. ఆధార్ సెంటర్లలో నమోదైన దరఖాస్తులు ఎక్కువ రిజక్ట్ అవుతున్నాయి.
- విద్యార్థి స్కూల్ రికార్డు ప్రాథమిక పాఠశాల నుంచే ప్రారంభమవుతుంది కనుక తల్లిదండ్రుల అంగీకారంతో మార్చుకునే అవకాశం ఉంది. కానీ ఉన్నత పాఠశాల్లో ఆ పరిస్థితి లేదు.

81 శాతం మందికి అపార్ కార్డులు



నిడమర్రు మండలంలో 4,564 మంది విద్యార్థుల్లో 81 శాతం మందికి అపార్ కార్డులు జనరేట్ పూర్తయ్యింది. మిగిలిన వాటిలో స్కూల్ రికార్డుల్లో నమోదైన తప్పుల కారణంగా తల్లితండ్రుల అంగీకారం తీసుకుని ఎస్‌వో-3ఫారం హెచ్‌ఎంల సమర్పిస్తే ఎంఈవో కార్యాలయం సిబ్బంది విద్యార్థి పేరు, డేట్ ఆఫ్ బర్త్, తల్లిదండ్రుల పేర్లు వంటివి మార్పు చేసేందుకు అవకాశం కల్పించారు. – గొరైల బాలయ్య, ఎంఈవో-2 , నిడమర్రు

ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



ఆధార్‌లో దోషాలున్న విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చెయ్యాలి. ఆధార్‌లో తప్పులు సరి చేసుకునే వారి కోసం అపార్ అందించే విషయంలో అధికారులు 20 రోజులు గడువు అవకాశం కల్పించాలి. పాఠశాలల వద్దే తల్లిదండ్రుల సమక్షంలో ఆధార్‌లో దోషాలు సరిదిద్దేలా ఏర్పాట్లు చేయాలి. తల్లిదండ్రుల అంగీకార పత్రం తీసుకునే అపార్ కార్డులు జారీ చేస్తున్నాం. – కె. బాల భాస్కరరావు, హెచ్‌ఎం, బాలికల జెడ్పీస్కూల్, గణపవరం

సమాజ హితాన్ని కోరే కవులు అభినందనీయులు



కవి పండితా గోష్టిలో పాల్గొన్న డాక్టర్ జటావల్లభుల సాయిరామ్, రిటైర్ట్ టీచర్ సీహెచ్ సూర్యప్రకాష్

భీమడోలు: సమాజ హితాన్ని కోరే కవి పండితులు అభినందనీయులని పలువురు వక్తలు అన్నారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం కవి సమ్మేళనం, పండిత చర్చా గోష్ఠి నిర్వహించారు. గ్రంథాలయ అభివృద్ధి చైర్మన్ తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు అధ్యక్ష వహించారు. కవి, తెలుగు అధ్యాపకులు డాక్టర్ జటావల్లభుల సాయిరామ్, రిటైర్ టీచర్ చందూరి సీతారామ సూర్య ప్రకాష్ పాల్గొని కవిత్వ మాధుర్యాన్ని విద్యార్థులకు, పాఠకులకు వివరించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. పూళ్ల శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు డీఎస్‌బీ అమర్‌నాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు దేశభక్తి గీతాలాపన పోటీలు నిర్వహించారు. న్యాయనిర్ణేతలుగా వీపీఎస్ ప్రభాకరరావు వ్యవహారించారు. గుండుగొలను శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు జి.నాగమణి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, విద్యార్థులకు పాటల పోటీలను నిర్వహించారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు

దెందులూరు: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని యువత విధిగా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని విజ్ఞానం పెంపొందించుకుంటూ అభివృద్ధికి బాటలు వేసుకోవాలని వక్తలు అన్నారు. దెందులూరు గారపాటి హైమావతి ఉన్నత పాఠశాల గ్రంథపాలకుడు ముళ్లపూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా కవి సమ్మేళనం, సాంస్కృతిక రంగ విశిష్టతలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యార్థులు ఉన్నారు.

ఉంగుటూరు శాఖా గ్రంథాలయంలో..

ఉంగుటూరు: శాఖా గ్రంథాలయం ఉంగుటూరులో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహించారు. గ్రామ పెద్దలు విశ్రాంత ఉపాధ్యాయుడు వాజపేయి సాంబమూర్తి, గ్రంథపాలకుడు సీహెచ్ గంగాధర్ రావు విద్యార్థినీ విద్యార్థులకు పరిశుభ్రత, ఆరోగ్యపు అలవాట్లు అంశంపై సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమానికి పలువురు పాఠకులు హాజరయ్యారు.

జంగం రాజేష్ మృతికి సంతాపం



జంగం రాజేష్ (ఫైల్)

దెందులూరు: సానిగూడెం సీనియర్ వైఎస్సార్‌సీపీ నాయకులు జంగం రాజేష్ ఆకస్మిక మరణం తనను కలిచివేసిందని దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆదివారం అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జంగం రాజేష్ సానిగూడెంలో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు ఉన్నారు. పార్టీలో చురుగ్గా ఉండే రాజేష్ చిన్న వయస్సులోనే చనిపోవడం బాధాకరమని అన్నారు. రాజేష్ మృతి పట్ల అబ్బయ్యచౌదరితోపాటు ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, ఫారెస్ట్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పళ్లెం ప్రసాద్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తేరా ఆనంద్, దెందులూరు ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ కాటి సుధాకర్, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం గంగరాజు, పార్టీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సానిగూడెం గ్రామ కమిటీ అధ్యక్షుడు ఫ్రాన్సిస్, సర్పంచ్ శనివల్లి రామకృష్ణ (విష్ణు) సంతాపం తెలిపారు.

జోరుగా గుట్కా ప్యాకెట్ల విక్రయాలు

- అమలుకాని నిషేధాజ్ఞలు
- లాభపడుతున్న వ్యాపారులు

పెదవేగి : గుట్కా విక్రయాలపై విధించిన నిషేధాజ్ఞలు ఎక్కడా అమలు కావడం లేదు. నిబంధనలకు విరుద్ధంగా కిళ్లీ షాపుల్లో, కిరాణా బడ్డీలపై గుట్కా విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. నియోజకవర్గంలోని పెదవేగి, పెదపాడు, దెందులూరు మండలాల్లో గుట్కా వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రతి కిళ్లీ బడ్డీలో పాన్‌పరాగ్, ఖైనీ, గుట్కా విక్రయాలు సాగుతున్నాయి. దానిపై ఉన్న రేటు కన్నా అధిక ధరలకు విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. వాటిని తిని ప్రజల ఆరోగ్యాన్ని గుల్ల చేసుకుంటున్నారు. ఒడిస్సా, కోల్‌కతా వంటి ప్రాంతాల నుంచి ఏలూరుకి అక్కడి నుంచి నియోజకవర్గంలోకి అన్ని గ్రామాలకు ఈ గుట్కా ప్యాకెట్లు దిగుమతి అవుతున్నట్లు సమాచారం. వీటితో పాటు అనుమతులు లేని పలు రకాల సిగరెట్లు కూడా ఇబ్బడి ముబ్బడిగా దిగుమతి అవుతున్నాయి. కొన్ని గుట్కా ప్యాకెట్లపై తయారీదారుల వివరాలు కూడా ఉండడం లేదని స్థానికులు చెబుతున్నారు. పొగాకు ఉత్పత్తులు సేవించడం పూర్తిగా మానేయాలని, గుట్కాలు, పాన్‌పరాగ్, ఖైనీలు నమలడం వల్ల దంత క్యాన్సర్, ఊపిరితిత్తుల వ్యాధులు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని పెదవేగి పీహెచ్‌సీ వైద్యులు పి పూర్ణిమ అన్నారు. దీనిపై ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ నిషేధిత మత్తు పదార్థాలైన గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్‌ను దుకాణాల్లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అక్రమంగా నిల్వ ఉంచినా కేసులు నమోదు చేస్తాం.

చేనేత కార్మికుల కార్తీక వన సమారాధన

ఉంగుటూరు: స్థానిక భద్రకాళీ అమ్మవారి మందిరం ఆవరణలో ఆదివారం చేనేత కార్మికుల కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఉసిరి చెట్టుకు రాష్ట్ర ఆప్కో మాజీ డైరెక్టర్ దొంతంశెట్టి సత్యనారాయణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కార్తీక వన సమారాధన కార్యక్రమం నిర్వహించారు. చేనేత కార్మికుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో తీడ కృష్ణమోహన్, వానపల్లి సతీష్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ శక్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎదగాలి

దెందులూరు: రాష్ట్రంలో మూడవ ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఎదగాలని అంబేద్కర్ ఆలోచన ఫౌండేషన్ రాష్ట్ర చైర్మన్ పినిపే వెంకటరామకృష్ణ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం దెందులూరులో ఆయన మాట్లాడారు. దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల ప్రజలందరి రాజకీయ, సామాజిక, ఆర్థిక పరిస్థితులు మారాలంటే అందరూ ఏకతాటిపై రావాల్సి ఉందన్నారు. మేధావులు, రిటైర్డ్ ఉద్యోగులు స్వచ్ఛంద సంస్థలు ప్రతినిధులు, అన్ని రంగాల్లోని ప్రముఖులను ఈ దిశగా మద్దతు కోరుతున్నామని రామకృష్ణ అన్నారు.

అక్కరకు రాని సిగ్నల్ లైటు



డివైడర్ ప్రారంభానికి దూరంగా ఏర్పాటు చేసిన సిగ్నల్ లైటు

దెందులూరు: ఆర్‌అండ్‌బీ శాఖ అధికారుల పనితీరుపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిని అనుకుని సోమవరప్పాడులో డబుల్ రోడ్డు ఉంది. ఈ రోడ్డు మధ్యలో హైవే అధికారులు సిగ్నల్ లైట్ స్తంభం ఏర్పాటు చేశారు. ఎక్కడైనా రోడ్డు ప్రారంభంలో సిగ్నల్ లైట్ స్తంభం ఏర్పాటు చేస్తారు. అలా చేయటం వల్ల డివైడర్ ఉందని గ్రహించిన వాహనదారులు అప్రమత్తమవుతారు. సోమవరప్పాడు డబుల్ రోడ్డు డివైడర్ ప్రారంభమయ్యే ప్రాంతానికి దూరంగా రోడ్డు మధ్యలో ఆర్‌అండ్‌బీ అధికారులు సిగ్నల్ లైట్ ఏర్పాటు చేశారు. జంగారెడ్డిగూడెం నుంచి వచ్చే వాహనదారులు ఇంకా డివైడర్ ముందు ఉందని దూసుకురావడంతో సోమవరప్పాడు వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్ ప్రారంభమయ్యే ప్రాంతంలో సిగ్నల్ లైట్ స్తంభాన్ని ఏర్పాటు చేయాలని దెందులూరు మండల ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు కోరుతున్నారు.

గ్రామాల్లో యథేచ్ఛగా బెల్ట్‌షాపులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మద్యం విధానం అమలవుతున్న నాటి నుంచి గ్రామాల్లో బెల్ట్ షాపులు విచ్చవిడిగా నిర్వహిస్తున్నారు. పెదవేగి మండలం బి శింగవరం ప్రధాన కూడలిలో యథేచ్ఛగా బెల్ట్ దుకాణాలు ఏర్పాటు చేసి పగలూ, రాత్రి తేడా లేకుండా మద్యం విక్రయిస్తున్నారు. ఈ చిన్న గ్రామంలో నాలుగు బెల్ట్ షాపులు నిర్వహిస్తున్నారంటే ఇక్కడి పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. గ్రామంలో విచ్చలవిడిగా అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాలపై అధికారులకు సమాచారం అందిస్తుంటే ఫోన్ చేసిన వారి వివరాలను లీక్ చేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీంతో అధికారపార్టీ నాయకులు, మద్యం సిండికేట్ వారు నేరుగా ఫిర్యాదు చేసిన వారి ఇళ్లకు వచ్చి రాద్ధాంతం చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. ఇలాంటి పనులకు ఇకనైనా స్వస్తి పలికితే గ్రామంలో శాంతిభద్రతలు నెలకొంటాయని, లేకుంటే చూస్తూ ఉరుకోబోమని గ్రామస్తులు ముకుమ్మడిగా హెచ్చరిస్తున్నారు.

గొడ్డలితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

పెదపాడు : ఓ వ్యక్తిపై గొడ్డలితో దాడి చేసి గాయపర్చిన ఘటనలో అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తిపై ఆదివారం పెదపాడు పోలీసులు కేసు నమోదు చేసారు. పెదపాడు పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం పెదపాడు మండలంలోని వసంతవాడకు చెందిన తట్టుకూరి కాసులు మాజీ సర్పంచ్ పులవర్తి అంకరాజు పొలంలో వ్యవసాయ పనులకు వస్తూ ఉంటాడు. ఈ నేపథ్యంలో అంకరాజు కుమారుడు శ్రీనివాసరావును డబ్బులు కావాలని అడిగాడు. తనకు ఇవ్వకుండా వేరొకరికి డబ్బులు ఇచ్చాడనే అక్కసుతో గొడ్డలితో దాడి చేసి కాలి పాదంపై వేటు వేసాడు. దీంతో పాదం ఊడిపోయేలా గాయం కావడంతో క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఉన్నత వైద్యం నిమిత్తం అతడిని విజయవాడకు తరలించారు. శ్రీనివాసరావు కుమారుడు రవికుమార్ ఫిర్యాదు మేరకు పెదపాడు ఎస్సై కట్టా శారదా సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వెంటాడుతున్న కూలీల కొరత

- నానాటికీ పెరుగుతున్న కూలి రేట్లు
- రైతులపై పెరుగుతున్న పెట్టుబడి భారం
- వేధిస్తున్న ఆధునిక వ్యవసాయ యంత్రాల కొరత



భోగాపురంలో వరి కోతలు కోస్తున్న కూలీలు

పెదవేగి : ఒక పక్క రోజుకో రకంగా మారుతున్న వాతావరణం సార్వా మసూళ్లు చేపట్టిన రైతులను భయపెడుతోంది. మరో పక్క వ్యవసాయ పనులు వేగవంతమయ్యేందుకు అవసరమైన ఆధునిక యంత్రాలు, కూలీలు అందుబాటులో లేకపోవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో కూలీలతో మాసూళ్లు చేసేందుకే అధిక శాతం రైతులు మొగ్గుచూపుతున్నారు. దెందులూరు నియోజవర్గంలో ప్రస్తుతం కూలీల కొరత తీవ్రంగాఉంది. దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లో వరి కోతలు చాలావరకు ప్రారంభమయ్యాయి. ఈ ప్రాంతంలోని సుమారు 25వేల ఎకరాల్లో వరి పంట మరో నాలుగు రోజుల్లో కోతకు రానుంది. దీంతో కూలీలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దీనికి తోడు గ్రామాల్లో ఉపాధి పనులు చేపట్టడంతో కూలీలు లభ్యం కాకపోవడంతో రైతులు తలలు పట్టుకుని పట్టుకుంటున్నారు. ఇందుకు అనుగుణంగానే కూలీ రేట్లు కూడా పెరిగాయి. మామూలు రోజుల్లో ఆడవారికి రూ.200, మగవారికి రూ.300 కూలి ఉంది. వరి కోతల సమయంలో ఆడ కూలీలకు రూ.400, మగవారికి రూ.500 చెల్లించాల్సి వస్తోందని రైతులు తెలిపారు. అంత మొత్తం చెల్లించడానికి సిద్ధపడినప్పటికీ కూలీలు లభ్యం కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఫలితంగా వరి కోతలు వాయిదా వేయాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని మరో వైపు వాతావరణం మేఘావృతమై భయపెడుతోందని రైతులు అన్నారు.

తగ్గుతున్న కూలీల సంఖ్య

గతంలో పొలం పనులు చేసేందుకు గ్రామస్తులు అధికంగా ఉండేవారు క్రమంగా వ్యవసాయ పనులకు వచ్చేవారి సంఖ్య తగ్గుతోంది. గతంలో వ్యవసాయ పనులు చేసేందుకు బంటా మేస్త్రీలు ఉండి కూలీల జట్టు నడిపేవారు. మేస్త్రీ వ్యవస్థ కనుమరుగయ్యింది.

అధిక కూలీ రేట్లతో రైతుపై భారం

దిగుబడులు కూడా అంతంతమాత్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో కూలీ రేట్లు పెట్టుబడులు పెరగడం రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. కూలీలకు అధిక ధరలు చెల్లించడం వల్ల వారిపై అధిక భారం పడనుంది. ప్రస్తుత సార్వాలో ఎకరం చేను కోత కోయడానికి రూ.7 వేలు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ట్రాక్టర్లతో మాసూళ్లు చేసేందుకు మరో రూ.3 వేలు అవుతుంది. కూలిరేట్లు పెరగడంవల్ల ఎకరానికి అదనపు వ్యయం అవుతున్నట్లు రైతులు చెబుతున్నారు. ఆరుదల లేదంటూ వ్యాపారులు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేయడంతో నష్టపోతున్నట్లు రైతులు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం చేయి దాటిపోయిన తరువాత ప్రభుత్వం గిట్టుబాటు ధర ప్రకటిస్తోంది. ప్రస్తుత సార్వాలో ఎకరానికి ఇప్పటికే సుమారు రూ. 25వేల వరకూ పెట్టుబడి పెట్టినట్టు రైతులు చెప్పారు. కౌలు రైతులు ప్రైవేటు వ్యాపారుల నుంచి అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రైతులకు ఉచితంగా ఆధునిక వ్యవసాయ యంత్రాలను అధిక సంఖ్యలో ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని తద్వారా సకాలంలో వరి మాసూళ్లు పూర్తవుతాయని రైతు పులగం వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. వ్యవసాయ పనులకు ఉపాధి హామీ పథకం వర్తింజేస్తే రైతులకు ఆర్థికంగా భారం తగ్గుతుందని రాట్నాల కుంటకు చెందిన రైతు గరికిముక్కు జ్ఞానేసు అన్నారు.